

సంపంగిరామనగర పుష్కరిణిలో దీపోత్సవం

శంభో.. శంకర..!

● కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాలు కిటకిట

కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా శైవ ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు దీపాలు వెలిగించి, శివనామస్మరణతో భక్తిని చాటుకున్నారు.

8



బళ్లారిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



అలంకరణలో విజయపుర నగరేశ్వరస్వామి

బసవణ్ణకు.. భక్తితో..

● శనక్కాయల పరుషకు పోటెత్తిన భక్తులు

● తులాభారంతో మొక్కులు..

● సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి : డీసీఎం డీకే



తులాభారంలో డీసీఎం డీకే శివకుమార్



అలంకరణలో దొడ్డ బసవణ్ణ



వెన్నతో అలంకరణలో దొడ్డగణేశుడు

బెంగళూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దొడ్డ బసవణ్ణకు భక్తులు శనక్కాయలతో మొక్కులు సమర్పించి భక్తిని చాటుకున్నారు. ప్రపంచంలోనే ఐటీ నగరిగా గుర్తింపు పొందినా సంప్రదాయాలు, సంస్కృతులకు మాత్రం ఇక్కడి ప్రజలు ప్రాధాన్యం ఇస్తూనే ఉంటారు. కొన్ని సంప్రదాయ జాతరలకు మాత్రం ఏటా ఆదరణ పెరుగుతోంది. అటువంటి సంప్రదాయమైనదే శనక్కాయల పరుష. శతాబ్దం కిందట బెంగళూరు నగరం నివాసాలు లేని వేళ ఓ బసవణ్ణ (ఎద్దు) మాగడి రోడ్డుతోపాటు వివిధ ప్రాంతాల్లోనే వేరుశనగ పంటను తిని నాశనం చేసేదని చరిత్రద్వారా తెలుస్తోంది. పంట కోతకు వచ్చినప్పుడు భక్తితో సమర్పించుకుంటామని రైతులు మొక్కుకున్నారు. అప్పటినుంచి ఏటా కార్తీకమాసం చివరి సోమవారం బసవనగుడిలో శనక్కాయల పరుష జరిపే సంప్రదాయం సాగుతోంది. సాధారణంగా రెండు రోజులు మాత్రమే పరుషకు అనుమతులు ఉన్నా దాదాపు వారంరోజులు కొనసాగనుంది.

దొడ్డగణేశుడికి వెన్నతో అలంకరణ

బసవనగుడిలో చారిత్రాత్మకమైన రెండు ఆలయాలు ఉన్నాయి. దొడ్డ గణేశ, దొడ్డ బసవణ్ణ ఆలయాలు అనుబంధంగా ఉన్నాయి. దొడ్డ గణేశకు వెన్న అలంకరణ చేశారు. వేలాదిమంది భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పక్కనే ఉండే దొడ్డబసవణ్ణకు శనక్కాయలు, పూలహారాలతో అలంకరించి పూజలు చేశారు. ఇదే ప్రాంగణంలోనే ఈశ్వరుడు, ఆంజనేయుడు, సీతారాములు, సత్యనారాయణ స్వామి, నాగదేవతల ఆలయాలు ఉన్నాయి. కార్తీక సోమవారం వివిధ రకాల దీపాలను వెలిగించి హారతులు పట్టారు.

బసవణ్ణకు తులాభారం

దొడ్డబసవణ్ణ ఆలయలో ఏర్పాటు చేసిన వేదికపై తులాభారం ద్వారా శనక్కాయల పరుషకు శ్రీకారం చుడతారు. బసవణ్ణ విగ్రహాన్ని త్రాసులో ఉంచి మరో వైపు డీసీఎం డీకే శివకుమార్ శనక్కాయలు సమర్పించడం ద్వారా పరుషను ప్రారంభించారు. ఎమ్మెల్యేలు రవిసుబ్రమణ్యా, కేసీ రామమూర్తి, ఉదయ్ గరుడాచార్, ఎమ్మెల్సీ యూబీ వెంకటేశ్‌తో, ఎమ్మెల్సీ శరవణ పాల్గొన్నారు.

వివిధ రాష్ట్రాలనుంచి వేరుశనగ

రాష్ట్రంలోని మండ్య, హాసన్, తుమకూరు, రామనగర, బెంగళూరు గ్రామీణ, కోలారు, చిక్కబళ్ళాపుర, చిత్రదుర్గ జిల్లాలతోపాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన రైతులు, వ్యాపారులు శనక్కాయలను తీసుకొచ్చారు. ఏడెనిమిది రకాల శనక్కాయలు జాతరలో అమ్ముడుపోయాయి. ఒక శేరు రూ.50చొప్పున విక్రయించారు.



శనక్కాయలు కొంటున్న యువతులు

ఉచితంగా దుకాణాలు

పరుషలో దుకాణాలకు ఏటా పన్ను చెల్లించాల్సి ఉండేది. బీబీఎంపీ దుకాణాల ఏర్పాటుతోపాటు ఇతరత్రా పర్యవేక్షణ చేసేవారు. ఈ ఏడాది శనక్కాయల పరుషలో దుకాణాలకు ఎటువంటి పన్ను లేకుండానే ఏర్పాటు చేసుకునే వెసలుబాటును దేవదాయశాఖ సూచన మేరకు బీబీఎంపీ పాటించింది. పన్ను లేకపోవడంతో సరుకు విక్రయాల ద్వారా ఆదాయం వస్తుందని వందలాది దుకాణాలు వెలిశాయి.

ఇతర ఆలయాల్లోనూ సందడి

కార్తీకమాసం చివరి సోమవారం పవిత్రమైన దినంగా భావించిన భక్తులు శివాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. కాడు మల్లేశ్వర, చామరాజపేటలోని మలె మహదేశ్వరతోపాటు జయనగరలోని రాఘవేంద్ర స్వామి మఠం, గవిగంగాధరేశ్వర స్వామి ఆలయంతోపాటు అన్ని శివాలయాల్లోనూ విశేషపూజలు జరిగాయి. ఎటుచూసినా భక్తుల సందడి నెలకొంది.



బెల్లం అచ్చులతో ..

ప్రతిపాదనలు పంపండి: సీఎం

● చాముండేశ్వరి దేవికి బంగారు రథం నిర్మాణంపై స్పందించిన సీఎం



బెంగళూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నాడ దేవత చాముండేశ్వరీ దేవికి బంగారు రథం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని సీఎం సిద్దరామయ్య సూచించారు. ఎమ్మెల్సీ దినేశ్ గూళిగౌడ వినతి మేరకు దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సూచించారు. చాముండేశ్వరి దేవికి బంగారు రథం ఏర్పాటు చేయాలనేది భక్తుల మనోభావాలతో కూడుకున్నదని ఎన్నో ఏళ్లుగా ఈ అంశంపై చర్చలు సాగినా ముందుకు సాగలేదు. సీఎం ఆదేశాలతో బంగారు రథం ప్రయత్నంలో ఓ అడుగు ముందుకేసినట్లయ్యింది. చాముండేశ్వరిదేవిని నాడదేవతగా కొలిచే సంప్రదాయం ఉంది. రాష్ట్రానికి చెందిన అన్ని జిల్లాల ప్రజలు చాముండేశ్వరిదేవిని భక్తితో కొలుస్తారు. ఏడాదికి ఒకటిరెండుసార్లు దర్శనం చేసుకునేందుకు వస్తుంటారు. చాముండి కొండలకు ఆలయానికి చాముండేశ్వరిదేవికి చారిత్రాత్మక నేపథ్యం ఉంది. అందుకు అనుగుణంగానే మైసూరులో జరిగే దసరా వేడుకలను నాడహబ్బగా పిలుస్తారు. దసరాలో విజయదశమి రోజున బంగారు అంబారీపై చాముండేశ్వరిదేవిని ఊరేగించే సంప్రదాయం ఉంది. ఇలా బంగారు అంబారీపై అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు దేశవిదేశాలనుంచి వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం కల్గిన చాముండేశ్వరి దేవికి బంగారు రథం ఏర్పాటు చేయాలనే భావన భక్తులలో సంతోషానికి కారణమవుతోంది. కాగా చాముండేశ్వరి దేవికి బంగారురథం అంశంపై ముఖ్యమంత్రి స్పందనపై బీజేపీ ఘాటుగా స్పందించింది. ఒకప్పుడు బొట్టు పెట్టుకునేది లేదన్న సీఎం ప్రస్తుతం బంగారురథం ప్రస్తావన తీసుకొచ్చారని విమర్శించారు.

వక్ఫ్ ఆస్తులపై బీజేపీ పాలనలోనే అత్యధిక నోటీసులు

● హోంమంత్రి పరమేశ్వర్

వక్ఫ్ ఆస్తుల వివాదానికి సంబంధించి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య తీవ్రస్థాయిలో విమర్శలు, నిరసనలు జరుగుతున్న తరుణంలోనే హోంమంత్రి పరమేశ్వర్ సంచలన అంశం బయటపెట్టారు.

7



హెచ్‌ఏఎల్ విమానాశ్రయం

హెచ్‌ఏఎల్‌కు మహర్దశ..!

● విమానాశ్రయం ఆధునికీకరణకు ఏఏఐ అంగీకారం

బెంగళూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఏఎల్ విమానాశ్రయాన్ని ఆధునికీకరించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అంగీకారం తెలిపింది. దేవనహళ్ళికి అనుబంధంగా కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించేదాకా హెచ్‌ఏఎల్ నుంచి విమాన సర్వీసులు నడిపేవారు. కెంపేగౌడ ఎయిర్‌పోర్ట్‌లో రెండు టర్మినల్స్ ద్వారా రోజూ వందలాది దేశీయ, అంతర్జాతీయ విమానాల రాకపోకలు సాగిస్తాయి. ప్రస్తుతం హెచ్‌ఏఎల్ ఎయిర్‌పోర్ట్ నుంచి డిఫెన్స్, వీవీఐపీలు, ప్రైవేట్ సంస్థల విమానాలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. ఇలా ప్రతిరోజూ 12 విమానాల రాకపోకలు ఇక్కడనుంచే సాగుతున్నాయి. ఇక్కడ 30 పార్కింగ్ ప్లేస్‌లు ఉన్నాయి. ప్రస్తుతం సిద్ధం చేసిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం 2045వరకు ఉత్తమంగా సేవలందించేందుకు అనుకూలంగా ఆధునికీకరణ చేయాలని నిర్ణయించారు. ఏడాదికి 40లక్షల మంది ప్రయాణికులకు అనుకూలం కానుంది. పీక్ అవర్స్‌లో గరిష్ఠంగా 2500మంది ప్రయాణికులను నిభాయించవచ్చు. 2007-08లో ప్రయాణికుల సంచారాన్ని నిలిపేశారు. అంతకుముందు 10లక్షలమంది ప్రయాణికులకు అనుకూలంగా ఉండేది. ప్రాజెక్టు ఒకటో విడతలో ఎయిర్‌పోర్ట్ ప్రదేశాన్ని 21,885 చదరపు మీటర్ల నుంచి 32వేలకు విస్తరించడం, టర్మినల్ కట్టడాన్ని పూర్తిగా తొలగించి నిర్మించడం, ప్రవేశం, నిర్గమనాలకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయదలిచారు. ప్రస్తుతం రెండు ద్వారాలు ఒకే చోట ఉన్నాయి. వీటితోపాటు మల్టీలెవెల్ కార్‌పార్కింగ్ ద్వారా ఒకే నిర్మాణంలో 500 కార్లు పార్కింగ్‌కు అనుకూలం చేయడం, ప్రస్తుతం హెచ్‌ఏఎల్ ఎయిర్‌పోర్టు వద్ద ఉండే రెండు లైన్ల రోడ్డును నాలుగు లైన్లకు విస్తరించనున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. రన్‌వేలో ఎటువంటి మార్పులు ఉండవని, 3,306 మీటర్ల పొడవు, 61 మీటర్ల వెడల్పు కలిగి ఉంది. నిబంధనల ప్రకారం ఇది దేశంలోనే అత్యుత్తమ రన్‌వేలలో ఒకటిగా నిలిచింది. కేంద్రప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం 2033 మేలోగా ప్రయాణికుల సేవలకు అందుబాటులోకి రానుంది. మరో ఎనిమిదేళ్లకు నగరంలో రెండు విమానాశ్రయాలు అందుబాటులో ఉన్నట్లు అవుతుంది.

హెచ్‌ఏఎల్ విమానాశ్రయాన్ని 1941 జనవరిలో ప్రారంభించారు. ఐదేళ్ల తర్వాత వాణిజ్య కార్యకలాపాలను అందుబాటులోకి తెచ్చారు. హెచ్‌ఏఎల్ విమానాశ్రయం నేరుగా నగరాలకు అనుబంధంగా ఉండేలా అభివృద్ధి జరిగింది. ఉడాన్ పథకం ద్వారా ప్రయాణికులకు అనుకూలం చేయాలని విమాన సర్వీసులు సరళీకృతం కావాలని కేంద్రప్రభుత్వం భావిస్తోందని, ప్రస్తుతం అన్ని విధాలా అందుబాటులో ఉన్న విమానాశ్రయాన్ని ఆధునీకరించదలిచారు.

మరోసారి ప్రమాణాల పర్వం..!

● జేడీఎస్ నేతలు జీటీ దేవెగౌడ, సారా మహేశ్ మధ్య సవాల్



జీటీ దేవెగౌడ

బెంగళూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి దేవుడి ముందు ప్రమాణం చేసే సవాల్ తెరపైకి వచ్చింది. జేడీఎస్ సీనియర్ నేత, కోర్ కమిటీ అధ్యక్షుడు జీటీ దేవెగౌడ ఇటీవల పలు వ్యాఖ్యలు చేశారు. తాను పార్టీకి దూరమయ్యేలా సా రా మహేశ్ ప్రయత్నించారని ఆరోపించారు. చివరిక్షణంలో సభా నాయకుడి హోదా కూడా దక్కలేదని జీటీ దేవేగౌడ వ్యాఖ్యానించారు. అందుకు సా రా మహేశ్ ధీటుగా స్పందించారు. కుమారస్వామి తనతో మాట్లాడడం లేదని అయినా జీటీ దేవెగౌడకు తన నుంచి రాజకీయంగా ఇబ్బంది కలుగుతోంది అంటే చాముండి కొండలపై ప్రమాణం చేసేందుకు సిద్ధమని సవాల్ చేశారు. అంతకుముందు జీటీ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ మైసూరు పర్యటనలో తన ఇంటికి వస్తారని సారా మహేశ్ ప్రచారం చేశారన్నారు. మాజీ ప్రధాని దేవెగౌడ పట్ల గౌరవంతో మౌనంగా ఉన్నానన్నారు. కుమారస్వామితో తనకు విబేధాలు వచ్చేందుకు ఆయనే కారణమన్నారు. కానీ జీటీ దేవేగౌడ ఏ విషయంలో సా రా మహేశ్‌తో విబేధాలనేది వెల్లడించలేదు. కాగా జీటీ దేవెగౌడ కొన్ని రోజులుగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నారు. మైసూరులో దసరా ఉత్సవాల వేళ సీఎం సిద్దరామయ్య ముడా కేసులో రాజీనామా చేస్తే కుమారస్వామిపై కూడా కేసులు ఉన్నాయని ఆయన రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. ఇటీవల ఉప ఎన్నికల్లో జీటీ దేవేగౌడను స్టార్ ప్రచారకుల స్థానం నుంచి దూరం చేయడమే కాక ఆహ్వానించలేదు. జేడీఎస్ నేతలకు మరో వ్యతిరేకి అయిన ఇబ్రహీం, దేవేగౌడ ఇకపై కలసి పోరాటం చేయాలనే ఆలోచన ఉన్నట్టు ప్రచారం సాగుతోంది.



సారా మహేశ్

నేటి నుంచి అగ్నివీర్

● ఉత్తర కర్ణాటక జిల్లా యువతకు అవకాశం

● కొప్పళ జిల్లా కీడ్రామైదానంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

● 9వేల మందికిపైగా నమోదు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశ భద్రతకు సైనికులుగా సేవ చేయాలన్న ఆశయం ఉన్న వేలాది మంది ఉత్తర కర్ణాటక యువకులకు అపూర్వ అవకాశం లభించింది. వారి తెలివితేటలు, శారీరక దృఢత్వాన్ని పరీక్షించేందుకు 'అగ్నివీర్' ఎంపికలు మంగళవారం నుంచి కొప్పళ జిల్లా స్టేడియంలో ప్రారంభం కానున్నాయి. జిల్లా యంత్రాంగం సహకారంతో, బెళగామ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ బృందం అవసరమైన సన్నాహాలు చేసింది. ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న 9,130 మంది యువతను పరీక్షించేందుకు వేదిక సిద్ధమైంది. జనవరి 26వ తేదీ నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు జిల్లా వారీగా నియామకాల ప్రక్రియ కొనసాగుతుంది. మొదటిరోజు మార్షల్ ఏరియాలో అందరినీ ఒకచోట చేర్చి 100 మందిని ఒక బృందంగా ఏర్పాటు చేస్తారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇచ్చిన సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. మొదట అర్హతగా 100మందిలో ప్రతి బృందానికి రెండు బ్యాచ్‌లలో మొత్తం 1600 మీటర్ పరుగు పందెం, సైన్యం ఎంపిక నియమాల ప్రకారం ఐదు నిమాషాల 4 సెకండ్లలో లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం దైహిక, వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలు పూర్తి చేసుకున్న వారికి ఒకటి రెండు రోజుల్లో ఫలితాలు వెల్లడవుతాయి. ఎంపికైన వారిని బెళగామ్ సేనా కేంద్రంలో శిక్షణ ఇస్తారు. ఎంపికలో లక్ష్యాన్ని మించి సాధన చేసిన వారిని మాత్రమే సైన్యంలోకి తీసుకుంటారు. బెళగావి, గుల్బర్గా, కొప్పళ, యాదగిరి, బీదర్, రాయచూరు జిల్లాల అభ్యర్థులు కార్యక్రమంలో పాల్గొంటారు. నవంబరు 26 నుంచి డిసెంబరు 5వ తేదీల్లో జరిగే రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఆయా జిల్లాల అభ్యర్థులు పాల్గొనాలని ఇప్పటికే షెడ్యూల్ సిద్ధం చేశారు. ఆర్మీటెక్నిల్ టీమ్(296), ఆఫీస్ అసిస్టెంట్(27), స్టోర్ కీపర్ టెక్నిల్ (203), ఆఫ్స్ స్టాప్(16) పోస్టులకు 6న రిక్రూట్‌మెంట్ జరుగుతుందని, అన్ని జిల్లాల అభ్యర్థులు దీనికి అర్హులు. ఇందుకోసం 542 మంది దరఖాస్తు చేసుకున్నారు. హాజరయ్యే అభ్యర్థులకు సిరమల్లేశ్వర దేవాలయం, సాహిత్యభవన్, పోలీసు భవన్, కొత్త థియేటర్లలో బస ఏర్పాటు చేసినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. దేశసేవపై ఆసక్తి ఉన్నవారికి ఇది వేదిక కానుందని బెళగామ్ అసిస్టెంట్ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ ఆర్.ఎం.లోహియా తెలిపారు.



కొప్పళ క్రీడా మైదానంలో ఏర్పాట్లు

ప్రకృతి గీసిన సిత్రాలు..!



వినువీధిని చీల్చుకు
వస్తూ భానుడు..
వడివడిగా అడుగులు
వేసే వేళ..
రెక్కలు తొడిగిన ఆకాశం
రివ్వు రివ్వున
ఎగిరే పక్షులతో...



అనంతపురం నగర శివారులో...

న్యూస్‌బాక్స్

ఫైనల్ పోటీలో ఓడిన సెపక్ తక్రా జట్టు

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సెపక్ తక్రా పోటీలలో అనంతపురం జిల్లా బాలుర జట్టుకు ఫైనల్స్‌లో ఓటమి ఎదురైంది. విజయవాడ నగరంలోని పటమట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ అండర్-13 బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి కృష్ణా జట్లు చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాయి. బాలుర ఫైనల్స్‌లో అనంతపురంపై 15-9, 15-11తో, బాలికల ఫైనల్స్‌లో పశ్చిమగోదావరిపై 15-6, 15-2తో కృష్ణా జట్లు గెలిచాయి. పోటీల్లో ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశామని పోటీల పరిశీలకుడు ఏపీ రాజు ప్రకటించారు. రాష్ట్ర జట్టులో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కడం విశేషం.

బాలురు జట్టు: ఎండీ జాకీర్ అహ్మద్, ఎస్.కార్తీక్(కృష్ణా), ఎం. రేవంత్(అనంతపురం), జి.సందీప్(తూర్పుగోదావరి), కె.అభిలాష్(పశ్చిమగోదావరి), బాలికలు: వి.కావ్య, ఎండీ రెహ్మామ(కృష్ణా), కె.వర్షిణి(పశ్చిమగోదావరి), ఎన్ కవిత(నెల్లూరు), ఎం భానుప్రియ(అనంతపురం).

స్టోర్ డీలర్ల భర్తీకి అడుగులు

జిల్లాలో 710 ఖాళీ

అనంతపురం టౌన్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): చౌక ధరల ధాన్యపు డిపో డీలర్ పోస్టుల భర్తీకి టీడీపీ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఆశాఖ కమిషనరు జిల్లా శాఖకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలో ఖాళీగా ఉన్న చౌకడిపోలను గుర్తించారు. పౌరసరఫరాల శాఖ అధికారుల లెక్కల మేరకు జిల్లాలో 1645డీలర్ షాపులు ఉన్నాయి. ఇందులో 710 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి జిల్లా యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది. డిసెంబరు మొదటివారంలో వీటి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఇప్పటికే కమిషనరు, కలెక్టరు ఆదేశాల మేరకు ఆర్డీఓలు డివిజన్‌లవారీగా ఖాళీలను గుర్తించారు. రెండు వారాలు పాటు దరఖాస్తులు స్వీకరిస్తారు. అనంతరం పోటీపరీక్ష పెట్టి, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అదేరోజే ఎంపికైన అభ్యర్థులకు డీలర్‌గా నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు డీఎస్‌ఓ తెలిపారు.

చీనీ టన్ను రూ. 34వేలు

అనంతపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.34,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 14వేలు, సరాసరి రూ. 21,400తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 127 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

- ఆర్టీసీ బస్సుపై రాయితో దాడి

అనంతపురం క్రైం,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. పక్కకు తప్పుకోమని ఆర్టీసీ డ్రైవర్ హారన్ కొట్టినందుకు బస్సుపై రాయితో దాడి చేశాడు. ఈ ఘటన అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగింది. నాలుగో పట్టణ ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపిన మేరకు... నగరంలోని జాకీర్ కొట్టాలకు చెందిన అహ్మద్ కళ్యాణదుర్గం రోడ్డులోని ఓ వైన్‌షాపులో మద్యం తాగి, రోడ్డు పక్కనే నిలబడ్డాడు. అదే సమయంలో అనంతపురం నుంచి రాయదుర్గం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వచ్చింది. అడ్డుగా ఉండటంతో పక్కకు వెళ్లాలని సూచిస్తూ డ్రైవర్ హారన్ కొట్టాడు. అంతే అహ్మద్‌కు కోపమొచ్చింది. మద్యం మత్తులో ... అన్ని సార్లు హారన్ కొడతావా అంటూ అక్కడున్న రాయి తీసుకుని బస్సుపై విసిరాడు. ఈ ఘటనపై బస్సు కండక్టర్ గోపాల్ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అహ్మద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బాలిక అదృశ్యం...

నగరంలో ఓ బాలిక అదృశ్యమైంది. జనశక్తినగర్‌కు చెందిన బాలిక పదో తరగతి చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఆదివారం రాత్రి 8.30గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లింది. రాత్రి ఇంటికి రాకపోవడం, సోమవారం ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నర్సు ...

నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సు ఇంటి నుంచి అదృశ్యమైంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... షిరిడీనగర్‌కు చెందిన నర్సు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆనంద్ ఆసుపత్రిలో పనిచేస్తోంది. భర్త హరితో కలిసి షిరిడీనగర్‌లో నివాసముంటోంది. వీరికి సంతానం లేదు. ఈ క్రమంలో మేఘన ఆదివారం రాత్రి 8గంటల సమయంలో బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త హరి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అహుడాను అగ్రస్థానంలో నిలుపుతా

నూతన అధ్యక్షుడు టీసీ వరుణ్

అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం



తరలివచ్చిన పార్టీ శ్రేణులు

అనంతపురం క్రైం/ప్రెస్‌క్లబ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అహుడాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలోకి తీసుకెళ్తామని నూతన చైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. నగరంలోని అహుడా కార్యాలయానికి సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పాదాభివందనాలు తెలిపారు. జిల్లాలో జనసేన పార్టీ కొన్నేళ్లుగా ముందుకెళ్తోందని, తమ నాయకుడు తమపై నమ్మకముంచి ఈ పదవి ఇచ్చారని అన్నారు. బాధ్యతగా పని చేసి ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 57 మండలాల పరిధిలో అహుడాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళతానని అన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన ఎంఐజీ లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేస్తామని తెలిపారు. అహుడా పరిధిలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని అన్నారు. అహుడా అనుమతి లేకుండా వేసిన లే అవుట్ల విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

తరలివచ్చిన నాయకులు

అహుడా చైర్మన్‌గా టీసీ వరుణ్ ప్రమాణ స్వీకారం చేస్తుండటంతో జనసేన కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. కూటమి నాయకులు భారీగా తరలివచ్చారు. టీసీ వరుణ్‌ను ఆయన నివాసం నుంచి బైకు ర్యాలీ నడుమ అహుడా కార్యాలయానికి తీసుకొచ్చారు. వేద పండితులు, ముస్లిం, క్రిష్టియన్ మతపెద్దలు ఆశీర్వదించారు. అనంతరం టీసీ వరుణ్ ప్రమాణ స్వీకారం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ టీసీ వరుణ్ నివాసానికి వెళ్లి సత్కరించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్, మాజీ మేయర్ స్వరూప, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, ఎంపీ అంబికా కుమారుడు వీక్షిత్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రోటరీ క్లబ్ కేశవరెడ్డి, నాయకులు సంపత్, గల్లా హర్ష, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, లిఖిత్‌రెడ్డి, చలపతి పాల్గొన్నారు. అహుడా సెక్రటరీ గౌరీశంకర్, ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్ చౌదరి, డీఈ రేవంత్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నాయకులు

రీచార్జ్ చేస్తేనే కరెంటు..!

విద్యుత్ కనెక్షన్లకు కొత్త స్మార్ట్ మీటర్లు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు
- మొదటి విడతలో 2.93లక్షల మీటర్లు బిగింపు
- మొబైల్ రీచార్జ్ తరహాలో ప్రీపెయిడ్ చేయాల్సిందే

అనంతపురంరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యుత్ సంస్థ కొత్త మార్పులకు శ్రీకారం చుడుతోంది. గతంలో విద్యుత్ మీటర్ నెంబరు ఆధారంగా నెలవారి బిల్లు ఇచ్చేవారు. ఆ తరువాత మెషీన్ల ద్వారా రీడింగ్ స్కాన్ చేసి విద్యుత్ బిల్లులు ఇచ్చేవారు. ఇప్పుడు కొత్తగా స్మార్ట్ మీటర్లను ప్రవేశపెట్టారు. మొబైల్ ఫోన్‌కు ఏవిధంగా అయితే రీచార్జ్ చేసుకుంటే పనిచేస్తాయో...అదే రీతిలో ఈ స్మార్ట్ మీటర్లు పనిచేయనున్నాయి. ఇది విద్యుత్ సంస్థలు, వినియోగదారులకు ఉభయ కుశలంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2.93లక్షల కనెక్షన్లకు బిగింపు

ఉమ్మడి జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో ఈ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 15.96లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహాలకు సంబంధించి 11.21లక్షలు ఉన్నాయి. వాణిజ్య కనెక్షన్లు 1.21లక్షలు, పరిశ్రమలు, 11,591, తాగునీటి పథకాలు, వీధిదీపాలు, మున్సిపాలిటీలు సంబంధించి 26,061, వ్యవసాయ కనెక్షన్లు 3.15లక్షల కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో వ్యవసాయ కనెక్షన్లు మినహా మిగిలిన అన్ని కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో రెండు వందల యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగం చేస్తున్న గృహ, పరిశ్రమలు, వాణిజ్య, పభుత్వ కార్యాలయాలతోపాటు ఉపకేంద్రాల్లో 11కేవీ, 33కేవీ ఫీడర్లు, హెవీ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మొదటి విడతలో భాగంగా ఆయా సర్వీసుల్లో ఎంపిక సర్వీసుల మేరకు 2,93,310 కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో 17,333 మీటర్లు బిగించారు. ఇందులో అనంతపురం డివిజన్‌లో 4006, గుత్తిలో 5121, కళ్యాణదుర్గం 2325, పుట్టపర్తి డివిజన్ 1252, కదిరి డివిజన్‌లో 1668, హిందుపురం డివిజన్‌లో 2961 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

మొబైల్ రీచార్జ్ తరహాలో ప్రీపెయిడ్

విద్యుత్ శాఖ ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు మొబైల్ రీచార్జ్ తరహాలో పని చేయనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్) ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెబుతున్నారు. ఈ యాప్ ద్వారా మొబైల్ ఫోన్ ద్వారా తమ ఇంటి కరెంటు సర్వీసు నెంబరు నమోదు చేసుకుని తద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే సౌలభ్యాన్ని తీసుకొనిరానున్నట్లు వెల్లడిస్తున్నారు. వినియోగదారులు ఎంత సొమ్ము అయితే రీచార్జ్ చేసుకుంటారో ఆ సొమ్ము అయిపోయేంతవరకు సరఫరా ఉంటుందని చెబుతున్నారు. మొబైల్ రీచార్జ్ తరహాలోనే విద్యుత్ రీచార్జ్ డబ్బు అయిపోయే వారం రోజుల ముందు నుంచి ఫోన్‌లకు సమాచారం వస్తుందని అంటున్నారు. ఒక వేళ రీచార్జ్ తేదీ గడువు ముగిసినా సరఫరా ఆగిపోకుండా కొంత సమయం ఉంటుంది. ఆ సమయం ముగిస్తే ప్రస్తుతం ఏవిధంగా అయితే అపరాధ రుసుముతో చెల్లించే వీలుంటుందో అదేవిధంగా చెల్లించేందుకు అవకాశం కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ ఇప్పటికీ ఇంకా మొదలు కానప్పటికీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తి అయిన తరువాత ప్రారంభం అయ్యే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

సేవలు మరింత సులభతరం చేయడానికి...

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వినియోగదారులకు అందించే విద్యుత్ సేవలను మరింత సులభతరం చేయడానికేనని విద్యుత్ అధికారులు అంటున్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ఎంత విద్యుత్ వినియోగం జరిగితే ఆమేరకు డబ్బు కట్ అవుతుంది. చాలా మంది తమకు ఎక్కువ బిల్లు వస్తోందని చేస్తున్న ఫిర్యాదులకు పరిష్కారం దొరుకుతుంది. ఇంట్లో రోజువారిగా ఎంత కరెంటు వినియోగిస్తున్నాం. ఏ ఎలక్ర్టానిక్ వస్తువు ఎంత కరెంటు లాగింది వంటి విషయాలను తెలుసుకునే వీలుంటుందని చెబుతున్నారు. వినియోగదారులు క్యూలైన్‌లో నిలబడి బిల్లులు చెల్లించే పని లేకుండా ఇళ్లలో నుంచే విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. ఎప్పటికప్పుడు మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ సర్వీసుకు రీచార్జ్ చేసుకునే సౌకర్యం ఉంటుంది. స్మార్ట్ మీటర్లలో ఏర్పాటు చేసిన ఇన్‌బిల్ట్ సిమ్ ద్వారా మీటర్‌లో రికార్డు అయ్యే మొత్తం సమాచారం ఆన్‌లైన్ ద్వారా చూసుకునే అవకాశం ఉంటుంది. ఎన్ని యూనిట్లు వినియోగించాం. రీచార్జ్ ఎంత చేశాం. ఎప్పుడు ముగుస్తుంది వంటి వివరాలు ఆన్‌లైన్ ద్వారా వినియోగదారులు తెలుసుకునే వీలుంటుంది.



నారాయణపురం పంచాయతీ కార్యాలయానికి ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

సేవలను చేరువ చేసేందుకే...



వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత చేరువ చేసేందుకు ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు జరుగుతోంది. వినియోగదారులకు వచ్చే సమస్యలను ఇందులో సులభంగా తెలుసుకోవచ్చు. విద్యుత్ ఎక్కడ వృథా అవుతోంది. సమస్యలు ఎక్కడ తలెత్తుతున్నాయి వంటి విషయాలను క్షేత్రస్థాయిలోని అధికారులతోపాటు మేము తెలుసుకునేందుకు వీలుంటుంది. అందుకు అనుగుణంగా పనులు చేస్తే వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతోపాటు సంస్థకు నష్టాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుంది.

- సంపత్ కుమార్, ఎస్ఈ విద్యుత్ శాఖ

ప్రజా ధనం రాళ్ల పాలు..!



వెస్టునరసాపురం సచివాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న రీసర్వే రాళ్ల

వృథాగా పడి ఉన్న రీసర్వే రాళ్లు

నాటడానికి ఒప్పుకోని కొందరు రైతులు

శింగనమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే పేరుతో వైసీపీ ప్రభుత్వం రైతులకు వారి పొలాల సరిహద్దులు చూపి, నాటడానికి తెచ్చిన రాళ్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లో సైతం ఈ రాళ్లను పూర్తిగా వాడలేదు. దీంతో కొన్ని రైతుల పొలాల వద్ద, గ్రామ సచివాలయాల వద్ద వృథాగా పడి ఉన్నాయి. జగన్ బొమ్మ ఉన్న ఈ రాళ్ల కోసం అప్పట్లో ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిందనే విమర్శలు వినిపించాయి. అయితే రీ సర్వేను తప్పుల తడకగా చేశారని ఆరోపిస్తూ పలువురు రైతులు రాళ్ల నాటడానికి ఒప్పుకోలేదు.

ఒక్కో రాయికి రూ.450 ఖర్చు

మండలంలోని 11 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి కావడంతో 10 గ్రామాలకు 8వేలకు పైగా సర్వేరాళ్లు వచ్చాయి. అయితే సరిహద్దులు సక్రమంగా వచ్చి, రైతులు ఒప్పుకున్న చోట మాత్రమే ఈ రాళ్లను పూడ్చారు. అలా ఇప్పటి వరకు దాదాపు రెండు వేల రాళ్లను పూడ్చినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వాటిలో కొన్ని రాళ్లను సచివాలయాలు, గ్రామ నౌకర్ల దొడ్లలో ఉంచారు. చాలా గ్రామాల్లో రైతుల పొలాల్లో వేసినా, వాటిని హద్దులకు పూడ్చలేదు. ఈ సర్వే రాయి విలువ ఒక్కొక్కటి రూ.450పైమాటేనని అధికారులు చెబుతున్నారు. రాయి, దానిమీద జగన్ బొమ్మతో కలిపి రూ.300 టెండర్ అని, దాన్ని పొలం హద్దు వద్ద పూడ్చడానికి మరో రూ.150 ప్రభుత్వం నుంచి వచ్చింది.

రాళ్లు పూడ్చనివ్వలేదు: గంగిరెడ్డి, రైతు



మా ఊరు రాచేపల్లిలో రీసర్వే పనులు చేపట్టారు. అయితే ఎక్కడా సర్వే సక్రమంగా పూర్తి కాలేదు. భూ విస్తీర్ణాలు హెచ్చు తగ్గులు రావడంతో రాళ్లను పూడ్చనివ్వలేదు. రీసర్వే పనులకు నిధులను దుర్వినియోగం చేశారు తప్ప రైతులకు ఎక్కడ మేలు జరగలేదు.

సర్వే రాళ్లను వద్దన్నాం: లక్ష్మిరెడ్డి, రైతు



మాది నిదనవాడ గ్రామం. రీసర్వే పనుల్లో భూముల విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. జగగన్న భూహక్కు పుస్తకం ఇవ్వడానికి గ్రామసభ ఏర్పాటు చేశారు. అప్పుడు రైతు అందరు కలసి మా భూముల వివరాలు ఖచ్చితంగా వచ్చే వరకు పుస్తకాలు తీసుకోమని తెగేసి చెప్పాం. రీ సర్వే రాళ్లు తీసుకొస్తామని అధికారులు తెలిపిన మా సమస్య పరిష్కరించేవరకు వద్దన్నాం.

రైతులు ఒప్పుకున్న చోటే నాటాం




రీసర్వే తరువాత ఇప్పటికే ఎల్‌పీ నంబర్ల ఇచ్చి పాసుపుస్తకాలు రైతులకు అందజేశాం. అయితే రైతులు ఒప్పుకున్న చోటే సరిహద్దులకు సర్వే రాళ్లను నాటాం. రైతులను బలవంతం చేసి ఎక్కడా నాటలేదు.

- పునీత్‌బాబు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్

30న జిల్లాకు సీఎం చంద్రబాబు రాక

రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటన



అనంతపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 30న జిల్లాకు రానున్నారు. జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలంలో ఏదైనా ఒక గ్రామంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన అధికారికంగా వెలువడాల్సి ఉంది. అయితే ముఖ్యమంత్రి పర్యటన దాదాపుగా ఖరారైనట్లు ఆ పార్టీ ముఖ్య నేతలు పేర్కొంటున్నారు. ఇప్పటికే రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బొమ్మనహాళ్ మండలంలో ఏ గ్రామంలో చంద్రబాబు పర్యటించాలో అందుకు అనుగుణంగా ఆ మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రే ప్రతినెలా ఏదో ఒక జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములవుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు రచ్చబండ తరహాలో... ఆ గ్రామ ప్రజలతో ముఖ్యమంత్రి సమావేశంకానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటోంది.

ఎన్టీఆర్ ట్రస్టు స్కాలర్‌షిప్‌ను సాధించండి

ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన



పరీక్ష ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వహించే గర్ల్స్ ఎడ్యుకేషన్ స్కాలర్ షిప్ పరీక్షలో ప్రతిభ చాటి ఉపకార వేతనం పొందాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన ఎన్టీఆర్ కళాశాల ప్రతినిధి కృష్ణారెడ్డితో కలిసి పరీక్షా ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లుగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలికలకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నారన్నారు. డిసెంబరు 8న హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ కళాశాలలో స్కాలర్ షిప్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షల్లో మొదటి 10 ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు నెలకు రూ.5వేలు చొప్పున, ఆ తర్వాతి 15 ర్యాంకులకు నెలకు రూ.3వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేస్తారన్నారు. వివరాల కోసం 9908551643, 7660002627, 7660002628 సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

జల్‌జీవన్ మిషన్ పథకం అమలుపై ఆరా



నీటి నాణ్యత పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కేంద్ర కమిటీ సభ్యులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల్ జీవన్ మిషన్ పథకం అమలు తీరుపై నేషనల్ జలజీవన్ మిషన్ సభ్యులు జాలి కేశవన్, సురేష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఉదయం ఈఈ మురళీధర్‌రావు, ఎస్‌ఈ పీప, డీఈ శ్రీరాములుతో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని ఎస్‌ఈ చాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. పథకం అమలుపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని పిలిపించి క్షేత్రస్థాయిలో అమలు తీరుపై ప్రశ్నించారు. సిబ్బంది సమాధానం చెప్పలేక నీళ్లు నమిలినట్లు సమాచారం. అయితే డీఈ, ఈఈలు దగ్గర ఉండటంతో తగిన విధంగా వివరణ ఇచ్చారు. అనంతరం శింగనమల డివిజన్ కార్యాలయం సమీపంలో ఉన్న నీటి శుద్ధి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈలు శ్రీరాములు, రేహానా వసీంలతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి స్థానిక ప్రజలతో పథకం అమలుపై ఆరా తీశారు. గుత్తి మండలంలోని పాతకొత్తపేట, పామిడి మండలంలోని ఎద్దులపల్లి, బుక్కరాయసముద్రం మండలంలోని వడియం పేట తదితర ప్రాంతాల్లో జలజీవన్ మిషన్ పథకం అమలు తీరును పరిశీలించారు.

ఉద్యోగ కల్పనలో గేమ్ చేంజర్

పీఎం ఇంటర్న్‌షిప్

500 కంపెనీల్లో కోటిమందికి ఉద్యోగాలు

మంత్రి సత్యకుమార్ యాదవ్



ఇంటర్న్‌షిప్‌పై అవగాహన కల్పిస్తున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం సెంట్రల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ఉద్యోగ కల్పన గేమ్‌చేంజర్ అని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక జేఎన్‌టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో పీఎం ఇంటర్న్‌షిప్ పథకంపై సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. తమ పిల్లలు ఉద్యోగాలను సంపాదించి, స్థిరపడాలన్న ఆకాంక్షతో తల్లిదండ్రులు కష్టాలకోర్చి చదివిస్తున్నారన్నారు. డీగ్రీలు, పీజీలు, పీహెచ్‌డీలు పూర్తిచేసినా సరైన ఉద్యోగావకాశాల్లేక తల్లిదండ్రుల కలలు నెరవేడంలేదన్నారు. దేశంలో పారిశ్రామిక, ఐటీ తదితర రంగాలు అభివృద్ధి చెందుతున్నాయనీ, వాటిలో ఉద్యోగం పొందాలంటే సంస్థలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అవసరమన్నారు. ఏటా లక్షలమంది విద్యార్థులు కళాశాలల్లో విద్యను పూర్తిచేసుకుని బయటకు వస్తున్నా నైపుణ్య లోపంతో ఉద్యోగాలు పొందడం లేదన్నారు. ఈ సమస్యలను అధిగమించి విద్యార్థులు, సంస్థలకు అనుసంధానం చేసేలా ఇంటర్న్‌షిప్ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ తీసుకువచ్చారని తెలిపారు. కోటిమంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పించేందుకు దేశవ్యాప్తంగా 500 కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఫార్మసీ తదితర కోర్సులు, అర్హతకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇస్తే కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ పొందేందుకు దోహదపడుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 12 నెలలు సంబంధిత కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ పూర్తవుతుందన్నారు. అనంతరం ఆయా కంపెనీలు ఉద్యోగులుగా అడాప్ట్ చేసుకుంటాయన్నారు. ఇతర కంపెనీల్లోనైనా ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. స్వయం ఉపాధి పొందవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఛార్లెస్ స్కల్జ్ (జయంతి)



అమెరికాకు చెందిన ఛార్లెస్ మన్రో స్కల్జ్ 1922 నవంబరు 26న జన్మించారు. కార్టూనిస్ట్‌గానే కాకుండా 'క్రియేటర్ ఆఫ్ ది కామిక్ స్ట్రిప్ పీనట్స్'గా గుర్తింపు పొందారు. ఇందులోని చార్లి బ్రౌన్, స్నూపి తదితర ప్రధాన పాత్రలు ఎంతో పేరొందాయి. 75 దేశాలు 21 భాషలలో 2,600 దినపత్రికలలో 'పీనట్స్' ప్రచురితమైందంటే ఎంతగా ప్రసిద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. దాదాపు ఐదు దశాబ్దాలపాటు కొనసాగగా 17,897 బొమ్మలు గీశారు. నేషనల్ కార్టూనిస్ట్ సొసైటీచే హర్యామర్ కామిక్ స్ట్రిప్ అవార్డు, రూబెన్ అవార్డు, మిల్టన్ కానిఫ్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇతర గౌరవాలు పొందారు. 2000 ఫిబ్రవరి 12న కన్నుమూశారు. తుదిశ్వాస వరకు టీవీ స్పెషల్స్‌కు రాయడం లేదా సహకారం అందిస్తూ ప్రొడక్షన్స్‌ను పరిశీలించేవారు.

ప్రొఫెసర్ యశ్‌పాల్ (జయంతి)



పద్మవిభూషణ్ గ్రహీత యశ్‌పాల్ 1926 నవంబరు 26న పంజాబ్‌కు అనుబంధమైన ఝూంగ్ ప్రాంతంలో (ప్రస్తుతం పాకిస్థాన్‌లో) జన్మించారు. శాస్త్రవేత్త, విద్యావేత్తగా రాణించారు. కాస్మిక్ కిరణాలపై ప్రత్యేక అధ్యయనం చేశారు. సైన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీలో ఆయన అందించిన సేవలకు 1976లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో కెరీర్‌ను ప్రారంభించిన ఆయన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఛైర్మన్‌గా, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. యునెస్కోచే కళింగ పురస్కారం, లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అవార్డ్, ఇందిరాగాంధీ ప్రైజ్ ఫర్ పాపులరైజేషన్ ఆఫ్ సైన్స్ ఇతరత్రా గౌరవాలు అందుకున్నారు. 2017 జూలై 24న కన్నుమూశారు.

శివాలయాలకు కార్తీక శోభ



సంగమేశ్వర ఆలయంలో బసవణ్ణకు గంధం అలంకరణ



శిడ్లఘట్టలో స్వామివారికి అలంకరణ



కైవార యోగినారేయణ తాతయ్యకు అలంకరణ



నాదసుధారస వేదికపై భక్తిగేయాలాపన



విజయపుర వేరుశనగ పరుషలో తహసీల్దార్ తదితరులు

▸▸ పలు ఆలయాల్లో విశేషపూజలు

బెంగళూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బెంగళూరు సహా రాష్ట్రవ్యాప్తంగా పలు శివాలయాల్లో కార్తీక సోమవారం విశేష పూజలు జరిగాయి. దక్షిణకన్నడ జిల్లా ధర్మస్థళ మంజునాథస్వామి ఆలయం, ఉత్తరకన్నడ జిల్లాలోని మురుడేశ్వర్‌లోనూ, కోలారు జిల్లాలోని కోటి లింగేశ్వర ఆలయంలో, నంజన్‌గూడు శ్రీకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బాగేపల్లిలో..

బాగేపల్లి: బాగేపల్లి తాలూకా వ్యాప్తంగా కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకుని విశేషపూజలు సాగాయి. జడల భైరవేశ్వర, పరగోడు పంచలింగేశ్వర, పాతపాళ్య హిరణ్ణయ్య దేవాలయం, గూళూరు వీరభద్రస్వామి, మానవధర్మ పీఠం మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. పలు ఆలయాల్లో బిల్వపత్రాలతో ప్రత్యేక పూజలు, రుద్ర అఅభిషేకాలు కొనసాగాయి.

శిడ్లఘట్టలో..

శిడ్లఘట్ట: శిడ్లఘట్ట పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలోనూ, సోమేశ్వరస్వామి ఆలయంలోనూ, చంద్రశేఖరస్వామి, విశ్వనాథేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు వైభవంగా జరిగాయి. వేకువ జాము నుంచే భక్తులు క్యూలో స్వామివారిని దర్శించుకున్నారు. రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఇతర పూజలు జరిగాయి. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాసోహం నిర్వహించారు.

విజయపురలో..



శిడ్లఘట్టలో స్వామికి అలంకరణ

విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని శిడ్లఘట్ట రోడ్డులోగల సంగమ బసవేశ్వర ఆలయంలో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. బసవణ్ణకు గంధం అలంకరణ చేశారు. సంగమేశ్వర ఆలయ నిర్వాహకులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పరమాత్ముడు మంత్రాధీనుడు - సదాశివ మహాస్వామిజీ

పరమాత్ముడు మంత్రాధీనుడని అందుకే జపతపాలు ఆచరించడం ద్వారా ఓం నమఃశివాయ పంచాక్షరి మంత్రాన్ని జపించడంతో భగవంతుడి కృప సాధ్యమని బసవకల్యాణ మఠం జూనియర్ స్వామిజీ సదాశివ మహాస్వామిజీ అభిప్రాయపడ్డారు. విజయపుర పట్టణంలోని బసవకల్యాణ మఠంలో కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకుని ఏర్పాటైన వేరుశనగ పరుషను ప్రారంభించడంతోపాటు అఖండ శివపంచాక్షరి మహామంత్ర భజన ముగింపు కార్యక్రమాన్ని సాన్నిధ్యం వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తాలూకా తహసీల్దారు బాలకృష్ణ మాట్లాడుతూ అధికారం అనేది కేవలం సేవకోసం మాత్రమేనన్నారు. తమ పాలనా అవధిలో మంచి పనులు చేయడం ద్వారా అవి శాశ్వతంగా నిలిచి ప్రజల ఆదరణ పొందుతామన్నారు. కళాశాల రిటైర్డు ఉపాధ్యాయుడు అబ్దుల్‌ఖాసిం మాట్లాడుతూ నేటి విద్య సర్టిఫికెట్‌లకే పరిమితమైందని విచారం వ్యక్తం చేస్తూ మంచి చెడులపై అవగాహన పెంచుకోవాలన్నారు. బసవకల్యాణ మఠం అధ్యక్షుడు మహదేవ స్వామిజీ మాట్లాడుతూ 12 శతాబ్దంలోనే బసవణ్ణ కుల, మత, వర్గ రహిత సమాజం కోసం పాటుపడ్డారన్నారు. ఈ సందర్భంగా రామోహహళ్ళి సిద్ధారూఢ మిషన్ ఆశ్రమ అధ్యక్షుడు ఆరూఢ భారతి స్వామిజీ తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో..

చింతామణి: చింతామణి తాలూకాలోని కైవార మఠంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని సద్గురు యోగినారేయణ తాతయ్యకు విశేషపూజలు, అలంకరణలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠం ప్రాంగణంలోని నాదసుధారస వేదికపై శ్రీనివాసపురకు చెందిన నాదనవ సంగీత కళాశాల టిఎం హరిప్రియా, శిష్యబృందం గాయన సేవతో భక్తులను అలరించారు. కాగా చింతామణి పట్టణంలోని పలు ఆలయాలతోపాటు ఇతర శివాలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి.

వేశ్యావాటికపై దాడి.. ఇద్దరి అరెస్టు

బంగారపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బాడుగ ఇంట్లో వేశ్యావాటిక నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించగా ఇద్దరు బాధిత మహిళలను రక్షించారు. దందాకు కారణమైన ఇద్దరు సూత్రధారి మహిళలను అరెస్టు చేసినట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దయానంద్ వెల్లడించారు. పట్టణంలోని ఒక ఇంట్లో కొన్ని నెలలుగా దందా సాగుతోందని, ఇతర రాష్ట్రాల బాలికలకు డబ్బు ఆశ చూపి ఈ వృత్తిలోకి దించుతున్నారన్నారు. చుట్టుపక్కలవారికి అనుమానం రాని రీతిలో దందా సాగించేవారన్నారు. కచ్చితమైన సమాచారం మేరకు డీఎస్పీ పాండురంగ మార్గదర్శకంలో దాడులు నిర్వహించామన్నారు. నిర్వాహకులు సరస్వతి, స్వాతిలను అరెస్టు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

నకిలీ క్లినిక్‌కు తాళం



అధికారుల పరిశీలన

శిడ్లఘట్ట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాలూకా ఆరోగ్య అధికారి, సీనియర్ ఆరోగ్య అధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రోషన్‌ల నేతృత్వంలో తాలూకాలో అకస్మిక దాడులు నిర్వహించారు. ఇ తిమ్మసంద్ర గ్రామంలో నకిలీ క్లినిక్ నిర్వహిస్తున్నారనే సమా చారంతో తనిఖీలు చేశారు. చుట్టుపక్కల వారు చికిత్సకు వచ్చేవారని అయితే నకిలీ క్లినిక్‌గా గుర్తించి తాళం వేశారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్

ధర్మవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ జేవీ సురేశ్‌బాబు ప్రకటనలో తెలిపారు.

కన్నడకు మరింత ప్రాధాన్యమివ్వాలి



కన్నడ రాజ్యోత్సవంలో సంఘం పదాధికారులు

దొమ్మసంద్ర, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కన్నడ భాషకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కస్తూరి కర్ణాటక జనపర వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మంజునాథ్ సర్జా అభిప్రాయపడ్డారు. సంఘం ఆటో విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన కన్నడ రాజ్యోత్సవంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సరిహద్దులోని ముళబాగిలు తాలూకాలో తెలుగు, కేజీఎఫ్‌లో తమిళం, కోలారులో తెలుగు, తమిళ భాషల ప్రభావం ఉందన్నారు. అయితే సరిహద్దులోని తమిళనాడులోని హోసూరు, తళి, డెంకణికోట, కృష్ణగిరిలలో కన్నడ మాట్లాడుతున్నారన్నారు. కన్నడ భాష మనుగడకు ప్రతి ఒక్కరూ సంకల్పం బూనాలన్నారు. కన్నడ భాష సంస్కృతి, ఆచార వ్యవహారాలు మరింత పెరగాలన్నారు. ఇప్పటికే సర్జాపుర పట్టణం భారీగా విస్తరించిదన్నారు. ఇక్కడ రాష్ట్ర, జాతీయస్థాయిలో షోరూంలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయన్నారు. నామ ఫలకాలలో 50శాతం కన్నడ ఉండేలా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కన్నడ రాజ్యోత్సవ పురస్కరించుకుని విద్యార్థులకు లేఖనా సామగ్రి పంపిణీ చేసి అన్నదాసోహం నిర్వహించారు. పురవీధులలో ఆటో ర్యాలీ ఆకట్టుకుంది. కార్య క్రమంలో సర్జాపుర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎస్‌వై శంభయ్య, ఎస్ఎం శ్రీనివాస్, మాజీ ఉపాధ్యక్షుడు సతీశ్‌కుమార్, ఆటో విభాగం అధ్యక్షుడు ప్రవీణ్, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్, ప్రముఖులు మధురనగర రవి, కామనహళ్ళి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ వివాదంపై బీజేపీ పాలనలో అత్యధిక నోటీసులు

▸▸ హోంమంత్రి పరమేశ్వర్

బెంగళూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తి వివాదానికి సంబంధించి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య తీవ్రస్థాయిలో విమర్శలు, నిరసనలు చేసుకుంటున్న తరుణంలోనే హోం మంత్రి పరమేశ్వర్ సంచలన అంశం బయటపెట్టారు. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడే వక్ఫ్ ఆస్తులుగా ఎక్కువమంది రైతులకు నోటీసులు ఇచ్చారన్నారు. సోమవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ పాలనలో 2900మందికి నోటీసులు ఇచ్చారని, సిద్దరామయ్య పాలనలో కేవలం 300మందికి మాత్రమే నోటీసులు ఇచ్చారన్నారు. సోమవారం నుంచి బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడపాటిల్ యత్నాళ్ నెలరోజులపాటు జిల్లాల వారీగా పర్యటించే కార్యక్రమానికి సిద్ధమైన తరుణంలో పరమేశ్వర్ వ్యాఖ్యానించారు. ఆందోళన చేసేముందు ఎవరిపాలనలో ఎక్కువ నోటీసులు జారీ అయ్యాయో తెలుసుకోవాలన్నారు. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులకు నోటీసుల అంశం తెలియదని, ప్రస్తుతం మా దృష్టికి వచ్చిందని జాగ్రత్తతో మసలుకుంటామన్నారు. 2018-23 మధ్య బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్న కుమార బంగారప్ప అధ్యక్షతన బీసీ మైనారిటీల సంక్షేమసంఘం తరఫున జిల్లా అధికారులతో సభ జరిపి వక్ఫ్ ఆస్తులను రక్షించాలని, జిల్లా అధికారులకు సూచించారన్నారు. ప్రస్తుతం ఆయనే ఆందోళనకు సిద్ధ మవుతున్నారన్నారు. యడియూరప్ప సీఎంగా ఉన్నప్పుడు 1735మందికి నోటీసులు ఇచ్చారన్నారు.

కేన్సర్‌పై చైతన్యానికి సైక్లోథాన్



విధానసౌధ వద్ద సైక్లోథాన్

బెంగళూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కేన్సర్‌ను ఆరంభంలోనే గుర్తిస్తే చికిత్సల ద్వారా సాధారణ జీవితం గడపవచ్చునని ప్రజలలో అవగాహన ముఖ్యమని హెచ్‌సిజి ఆసుపత్రి సీఈఓ మనీషా కుమార్ అభిప్రాయపడ్డారు. ప్రొస్టేట్ కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు నగరంలో సైక్లోథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 400మంది సైక్లిస్ట్‌లు, డాక్టర్‌లు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. కేఆర్ సర్కిల్‌లో ప్రారంభం కాగా విధానసౌధతోపాటు నగరంలోని ప్రధాన రహదారులపై ర్యాలీ సాగింది. అంకాలజీ డైరెక్టర్ రఘునాథ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

మారమ్మ ఆలయం ప్రారంభం



విశేషపూజల్లో జడ్పీ మాజీ సభ్యుడు హరినాథరెడ్డి తదితరులు

బాగేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని చన్నరాయనపల్లిలో గ్రామస్తులు నూతనంగా నిర్మించిన మారమ్మ దేవాలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించి సోమవారం విశేషపూజలు జరిపారు. ప్రత్యేక పూజల అనంతరం జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు హరినాథరెడ్డి మాట్లాడుతూ డబ్బు ఆస్తి సంపాదనతో శ్రీమంతులు కావచ్చునని అయితే ధార్మికక్షేత్రాల సందర్శనతో దైవభక్తితో ప్రశాంతత సాధ్యమన్నారు. గ్రామస్థుల అందరి సహకారంతో ఆలయ నిర్మాణం సాధ్యమైందన్నారు. రెండు రోజులుగా దీపారాధన, గంగపూజ, కళశస్థాపన, గణపతి, నవగ్రహ హోమం, నవగ్రహ ఆరాధన, గోపూజ తదితర ధార్మిక కైంకర్యాలు జరిగాయి. విశేషపూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాసోహం నిర్వహించారు. గ్రామస్థులు కేవీ శ్రీనివాస్, నాగరాజు, జి రంగస్వామి, ఆర్‌వీ దేవరాజు, శ్రీనివాస్, శివప్ప, కార్తీక్, రామాంజినప్ప, జయకుమార్, శివ, ఎస్ అశ్వత్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి భూమిపూజ

బొమ్మనహళ్ళి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొమ్మనహళ్ళి నియోజకవర్గంలోని పురాతనమైన బేగూరులోని నాగనాథేశ్వర ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం విశేషపూజలు జరిగాయి. ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, బీజేపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఇదే సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కల్యాణమండపానికి భూమిపూజ నిర్వహించరు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. కాగా ఇతర ఆలయాల్లో ఓం నమఃశివాయ భక్తుల నామస్మరణతో సందడి నెలకొంది.



భూమిపూజలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తదితరులు

సీనియర్ ఐఏఎస్ సెల్వమణి బదిలీ

బెంగళూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక అర్బన్ వాటర్ సప్లయ్ అండ్ డ్రైనేజ్ బోర్డు ఎండీగా కొనసాగుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ సెల్వమణి బదిలీ అయ్యారు. ఆయనను స్వచ్ఛభారత్ మిషన్ (అర్బన్) బెంగళూరు డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఈనెల 19న ఉత్తర్వులు సిద్ధం కాగా ఎన్నికల కోడ్ అడ్డంకి కావడంతో సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

హత్యకేసు నిందితుడిని పట్టించిన పెండ్లి పత్రిక

- 26ఏళ్ల క్రితం బిడ్డను హతమార్చి పరారైన తండ్రి
- పేరు మార్చుకుని కర్ణాటకలో జీవనం ● మళ్లీ పెళ్లి
- రెండో భార్య కూతురి పెండ్లి పత్రిక ఆధారంగా విచారణ ● నిందితుడి అరెస్టు

పుట్టపర్తిరూరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో కన్నబిడ్డ అని కూడా చూడకుండా ఆరు నెలల పసికందును గొంతు నులిమి అమానుషంగా చంపేశాడు. తోటలో పాతిపెట్టి పరారయ్యాడు. కర్ణాటకలోని మారుమూల ప్రాంతానికి చేరాడు. పేరు మార్చుకున్నాడు. వేరే పేరుతో ఓ రైతు తోటలో పనికి చేరాడు. అక్కడే ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు కుమార్తెలు జన్మించారు. ఇలా 26 ఏళ్లు గడిచిపోయాయి. అంతా మరచిపోయారనుకున్నాడు. పోలీసులు పట్టించుకోలేదనుకున్నాడు. ఏమీ కాదులే అనుకున్నాడు. రెండో భార్య కూతురి వివాహానికి స్వగ్రామానికి చెందిన చిన్ననాటి మిత్రుడిని ఆహ్వానించాడు. ఆ మేరకు వివాహ ఆహ్వాన పత్రిక కూడా పంపాడు. అక్కడ దొరికిపోయాడు. ఆ పత్రికను పట్టుకుని పోలీసులు కూపీలాగారు. మాటువేసి, నిందితుడిని పట్టుకున్నారు. 26 ఏళ్ల తరువాత కుమారుడిని చంపిన తండ్రిని అరెస్టు చేశారు. రివార్డులు, అభినందనలు అందుకున్నారు.

గుడిబండ మండలం దిన్నేహట్టిలో 26 ఏళ్ల క్రితం కుమారుడిని హత్య చేసి పరారైన తిప్పేస్వామి అలియాస్ కృష్ణ గౌడను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ రత్న వెల్లడించారు. గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామానికి చెందిన గొల్ల తిప్పేస్వామికి 30 సంవత్సరాల క్రితం అదే ఊరికి చెందిన మేనత్త పట్టెమ్మ కుమార్తె కరియమ్మతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు జన్మించారు. భార్య ప్రవర్తనపై తిప్పేస్వామి అనుమానం పెంచుకున్నాడు. చిన్నకుమారుడు శివలింగయ్య (6నెలలు) తనకు పుట్టలేదని భావించిన తిప్పేస్వామి.. పసికందును ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈనేపథ్యంలో 1998 అక్టోబరు 2వ తేదీన ఉదయం దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని దిన్నేహట్టి సమీప పొలాల్లోని మారెమ్మ జమ్మి కట్టకు ప్రదక్షిణ చేద్దామని భార్య, కుమారుడిని పిలుచుకెళ్లాడు. కుమారుడు శివలింగయ్యను ఎత్తుకుని కరియమ్మ ప్రదక్షిణ చేస్తుండగా తిప్పేస్వామి పిల్లవాడిని లాక్కుని పరారయ్యాడు. తన మామిడితోటలోకి వెళ్లి చిన్నారిని గొంతునులిమి చంపేశాడు. అక్కడే గొయ్యితీసి, పాతిపెట్టి పారిపోయాడు. దీనిపై కరియమ్మ 1998 అక్టోబరు 18న గుడిబండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడి గాలింపు చర్యలు చేపట్టారు. అతడి ఆచూకీ లభించక పోవడంతో చార్జిషీట్ దాఖలు చేశారు.

పేరు మార్చుకుని..

కుమారుడిని చంపి పరారైన తిప్పేస్వామి కర్ణాటక రాష్ట్రంలోని హాసన్ జిల్లా అర్సురు గ్రామానికి చేరుకున్నాడు. జవారప్ప వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉండేవాడు. పేరు మార్చుకుని కృష్ణగౌడగా వారికి పరిచయమయ్యాడు. అదే ప్రాంతానికి చెందిన తారను పెళ్లి చేసుకున్నాడు. వీరికి తులసి, సౌమ్య ఇద్దరు కుమార్తెలు జన్మించారు. ఏళ్లు గడిచినా స్వగ్రామం దిన్నేహట్టిలోని స్నేహితుడు గొల్ల నాగరాజు అలియాస్ బాంబే నాగరాజుతో రహస్యంగా స్నేహం నెరుపుతుండేవాడు. ఈక్రమంలో తిప్పేస్వామి తండ్రి చిత్తప్ప ముసలివాడు అయ్యాడనీ, మొదటి భార్య కరియమ్మ కూడా గ్రామంలో లేదని బెంగుళూరుకు వెళ్లిపోయిందనీ, కొడుకును చంపిన విషయం గ్రామస్థులు మరచిపోయారనీ, పోలీసుల కేసు కూడా లేదని నాగరాజు చెప్పాడు. ఈ నేపథ్యంలో ఊరికొచ్చి భూమి భాగ పరిష్కారాలు చేసుకోవాలని స్నేహితుడు సలహా ఇచ్చాడు.

అరెస్టు ఇలా..

తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడ నాలుగునెలల క్రితం తన చిన్న భార్య తార కూతురు సౌమ్య పెళ్లికి రావాల్సిందిగా వివాహ ఆహ్వాన పత్రికను నాగరాజుకు పంపాడు. నాగరాజు, అతడి భార్య న్యామనహళ్లిలో వివాహానికి హాజరై, వచ్చారన్న విషయం గ్రామస్థులకు తెలిసింది. దీనిపై సమాచారం అందడంతో ఎస్పీ రత్న.. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు.. నాగరాజును విచారించి, పెళ్లి పత్రికను సేకరించారు. నాగరాజు సలహా మేరకు భూముల భాగపరిష్కారం కోసం నెలకిందట దిన్నేహట్టికి తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడ వచ్చి వెళ్లాడన్న పక్కా సమాచారంతో పోలీసులు మాటు వేశారు. అందులో భాగంగా సోమవారం భాగపరిష్కారం కోసం తన తమ్ముడు చిత్తప్ప, చెల్లెలు కంచమ్మతో పెద్దమనుషుల ద్వారా మాట్లాడడానికి మందలపల్లికి వెళ్లేందుకు దిన్నేహట్టి బస్టాండు వద్దకు తిప్పేస్వామి చేరుకున్నాడు. మడకశిర సీఐ రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ మునిప్రతాప్.. సిబ్బందితో కలిసి వలపన్ని అతడిని పట్టుకున్నారని ఎస్పీ వివరించారు. నేరం చేసినవారు ఎప్పటికీ తప్పించుకోలేరన్న విషయం తిప్పేస్వామి అరెస్టు ద్వారా స్పష్టమైందని ఎస్పీ వివరించారు. సమావేశంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.



నిందితుడిని పట్టించిన పెళ్లికార్డు

సిబ్బందికి రివార్డులు

26 ఏళ్లుగా పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడను చాకచక్యంగా పట్టుకున్న పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, మడకశిర సీఐ రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్, సిబ్బందిని ఎస్పీ రత్న అభినందించారు. రివార్డులను అందజేశారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.33	1596.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,359	506
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,039	10,461
నీటి నిల్వ (టీఎంసీలు)	95.31	16.85

28న పోలీసు క్రీడాపోటీలు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ వార్షిక క్రీడా పోటీలను ఈ నెల 28వ తేదీన డీఏఆర్ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పోటీలను జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ ప్రారంభిస్తుండగా, కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సంకనూరు హాజరువుతారు. వార్షిక క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం నవంబరు 30వ తేదీన సాయంత్రం 4.30గంటలకు ఐజీపీ బిఎస్.లోకేష్ కుమార్, బళ్ళారి రీజినల్ డివిజన్ డీసీఎఫ్ నందీఫ్ హెచ్.సూర్యవంశి ముఖ్య అతిధులుగా పాల్గొంటున్నట్లు తెలిపారు.

రవాణా అధికారుల సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో రవాణా అధికారులు

బళ్లారిరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో రవాణా సిబ్బంది కాలుష్యంపై అవగాహన కల్పిస్తూ సైకిల్ ర్యాలీ చేపట్టారు. సోమవారం కనక దుర్గమ్మ ఆలయం సమీపంలో ఆర్టీవో శ్రీనివాస్ గిరి నేతృత్వంలో కార్యాలయ సిబ్బంది సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం అధికం కావడంతో పలు అనర్థాలు జరుగుతున్నాయని, సైక్లింగ్‌తో పాటు బ్యాటరీ వాహనాల వాడకం వల్ల కాలుష్యం తగ్గించవచ్చన్నారు. కనకదుర్గమ్మ ఆలయం నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఆర్టీఓ అధికారులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన డీసీ



కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న డీసీ నితీశ్

రాయచూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న మామిడి చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లాధికారి నితీశ్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ భోసరాజు అనుమతి ఇవ్వడంతో నగరంలో మామిడి చెరువులో అభివృద్ధి పనులనుప్రారంభించగా, ఈ నేపథ్యంలో పనుల స్థలాన్ని జిల్లా అధికారి నితీశ్ పరిశీలించారు. పనులు నాణ్యత ప్రమాణాలతో ఉండేలా చూసుకోవాలని కాంట్రాక్టర్‌లకు డీసీ సూచించారు. డీసీ వెంట మున్సిపల్ కమిషనర్ గురుసిద్దయ్య హిరేమఠ్, నగరసభ అధికారులు తదితరులు ఉన్నారు.

అండర్‌పాస్ పనులతో ప్రయాణం నరకం

● తరచూ ట్రాఫిక్ జామ్.. వాహనదారులకు ఇబ్బందులు ● మరిన్ని రోజులు కష్టాలు తప్పవా?

బళ్లారి గాంధీనగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో కీలకమైన రహదారి అండర్ పాస్ మరమ్మతులతో వాహనదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. నగరాన్ని దుర్గమ్మగుడి, సత్యనారాయణ పేట అండర్‌పాస్‌లు రెండు భాగాలుగా విభజిస్తాయి. ఈ రెండు అండర్‌పాస్‌లో ఏ ఒక్కటి బంద్ అయినా... నగరంలో వాహనాల రాకపోకలు తీవ్రంగా స్థంబించే పరిస్థితి నెలకొంటుంది. నగరంలో ప్రధానంగా రాయల్ సర్కిల్ నుంచి గాంధీనగర్, కప్పగల్లు, తాళూరు, సిరుగుప్ప వైపు, సుధాసర్కిల్ వైపు వెళ్ళు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. అదేవిధంగా గాంధీనగర్ నుంచి నగరంలోని బెంగళూరు రోడ్డు, జిల్లాధికారి కార్యాలయం, మోతి సర్కిల్, కౌల్ బజార్ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు వెళ్లాలంటే సత్యనారాయణ అండర్ పాస్ లేకపోతే, పై ఓవర్ మీదుగా వెళ్ళాల్సి ఉంటుంది. నగరంలో ప్రభుత్వ ప్రవేట్ కళాశాలలకు వెళ్ళాలంటే దుర్గమ్మ గుడి అండర్‌పాస్ ప్రధాన రహదారి కావడంతో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సుల్లో వెళ్ళే విద్యార్థులకు ఇబ్బందులు ప్రారంభం అయ్యాయి. కౌల్ బజార్ వెళ్ళే వారు సుధాక్రాస్ మీదుగా వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం దుర్గమ్మ గుడి అండర్ పాస్ అభివృద్ధి పనులు ప్రారంభ దశలో ఉండడంతో అంతవరకు వాహన దారులకు, నగర ప్రజలకు ఇబ్బందులు తప్పవని అనిపిస్తోంది. కేకేఆర్‌డీబీ నిధుల కింద నిర్మిత కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. రాత్రి పగలు పనులు జరిగినా... పూర్తి స్థాయిలో పనులు పూర్తి కావడానికి కనీసం 20 రోజులు పైమాటే. అంతవరకు నగర వాసులకు తిప్పలు తప్పవనిపిస్తోంది. ఇప్పటికే జిల్లా పోలీసు విభాగం అండర్‌పాస్ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలను మళ్ళిస్తూ ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే.



మరమ్మతులతో ఇబ్బంది పడుతున్న పాదచారులు



అండర్ పాస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

బళ్లారి సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి సోమవార పరిశీలించారు. కనక దుర్గమ్మ దేవాలయానికి సమీపంలోని అండర్ పాస్ మరమ్మతు పనులను పరిశీలించన ఆయన విలేకరులతో మాట్లాడారు. కనకదుర్గమ్మ దేవాలయం ప్రక్కన బస్‌స్టేషన్ దగ్గర ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టాలని, రోడ్డు మధ్యలో ఉన్న మొక్కలను తీసేసి రోడ్డును అభివృద్ధి చేయాలన్నారు. ఏపీఎంసీ సర్కిల్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వాల్మీకి వృత్తాకార నవీకరణ సర్కిల్ నిర్మాణ పనులకు సంబంధించి అధికారులు, కృషిదారుల ద్వారా సమాచారం పొంది పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. అనంతరం మోకారోడ్డు కేఈబీ వృత్తాంతంలో జరిగిన రోడ్డు వెడల్పు, సుందరీకరణ పనులను వీక్షించారు. ఈసందర్భంగా నగర కమిషనర్ ఖలీల్‌సాబు, కార్పొరేటర్లు మించుశ్రీనివాస్, పాలక సంస్థలు కాంట్రాక్టుదారులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

● జిల్లా సెషన్స్ న్యాయాధికారి శాంతి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి శాంతి

బళ్లారి సిటీ,నవంబరు25(ఆంధ్రజ్యోతి): మహిళలు పనిచేసే సురక్షితమైన వాతావరణం కల్పించాలని, అది వారి ప్రాథమిక హక్కు అని న్యాయాధికారి శాంతి పేర్కొన్నారు. అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొత్త జిల్లా కోర్టు హాల్లో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించాలన్నారు. శారీరక వేధింపులను ఎదుర్కొనేలా మహిళలకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఫిర్యాదులను పరిష్కరించడానికి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో లాయర్ శివలీల పనిస్థలంలో వేధింపుల నిరోధక చట్టం గురించి మహిళలకు వివరించారు.. ఈసందర్భంగా సీనియర్ సివిల్‌న్యాయాధికారి రాజేశ్ హొసమనె , జిల్లా కోర్టు మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పంచాయతీ అధ్యక్షురాలు ఈరమ్మ

కంప్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవలాపురం ప్రభుత్వ పాఠశాలలో ఈఆర్‌డీ నిధులతో రూ. 16 లక్షల వ్యయంతో నూతన గదులకు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఈరమ్మ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఈరమ్మ మాట్లాడుతూ విద్యార్థులు పొరుగు గ్రామాలకు వెళ్లకుండా పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు నాగేష్ మాట్లాడుతూ పాఠశాలలో సమస్యలను ఎమ్మెల్యేతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాగరాజ, నల్లమ్మ, మల్లికార్జున, బూదల్లి రవి, ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్, శివకుమార్, సిద్దయ్య, లింగప్ప, సిద్దన్న, లింగనగౌడ, నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన అవినీతిమయం

● మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలనలో అవినీతి విలయతాండవం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప అభిప్రాయపడ్డారు. సోమవారం సిరుగుప్ప పట్టణ బీజేపీ కార్యాయంలో బూత్ స్థాయి కమిటీల ఏర్పాటుకు కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సోమలింగప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి రాత్రికి రాత్రే తరలిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతిపై పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి నూతనంగా బూత్‌స్థాయి కమిటీలు ఏర్పాటుచేస్తామన్నారు. మంగళవారం నుంచి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గాలి శంకరప్ప మాట్లాడుతూ శక్తి కేంద్రాల నాయకులు బూత్‌స్థాయి కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. యువ నాయకుడు ధరప్ప నాయక మాట్లాడుతూ ప్రతిఒక్క కార్యకర్త బూత్‌స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముందడుగు వేయాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షుడు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ ఉలిగప్ప, ప్రధాన కార్యదర్శి బెళగల్ బసవరాజు, బండ్రాల్ మల్లికార్జున, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షుడు మైఖేల్ వీరేష రైతు నాయకులు ఎంఆర్ గౌడ, సిద్దరామనగౌడ, కార్యకర్తలు పాల్గొన్నారు.

చారిత్రక పోరాటానికి కేంద్రం దిగిరావాల్సిందే..

●ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస

రాయచూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం సాగుతున్న చారిత్రక పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందేనని ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్ కళస అన్నారు. రెండున్నర ఏళ్లుగా నిరవధిక సమ్మె కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం రాయచూరుకు ఎయిమ్స్ మంజూరు చేయకుండా జాప్యం చేస్తుండడం ఆశ్చర్యకరమన్నారు. నగరంలోని మహాత్మ గాంధి స్టేడియంలో నిర్వహిస్తున్న ఎయిమ్స్ నిరవధిక సమ్మె దీక్ష శిబిరంలో సోమవారానికి 928వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ బసవరాజ్ కళస, ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికగా ఉన్న ఎయిమ్స్‌ను మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులేమో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎయిమ్స్ మంజూరుకు సమ్మతించిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా ఎందుకు ప్రయత్నం చేయడం లేదని నిలదీశారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం నాయకులందరూ ముఖ్యంగా ఇక్కడి ప్రజాప్రతినిధులు తమవంతు పాత్ర పోషించాలని ఈ సందర్భంగా పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు.



దీక్షలో పాల్గొన్న పోరాట సమితి నాయకులు

శివకుమార్‌కు అంబేడ్కర్ సేవాశ్రీ అవార్డు

కంప్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వీఎస్‌కేయూ సిండికేట్ సభ్యుడు శివకుమార్ రాష్ట్రీయ డాక్టర్ అంబేడ్కర్ సేవాశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. గతంలో దేవలాపురం గ్రామానికి చెందిన శివకుమార్ దళిత ప్యాంతర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగాను, మాజీ గ్రామ పంచాయతీ సభ్యుడుగాను, వీఎస్‌కే విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యుడిగా వుంటూ ఎన్నో సేవలు అందించారని వారిని గుర్తించి వారికి ఢిల్లీలో జరుగుతున్న భారతీయ దళిత సాహిత్య అకాడమీ వారు 2024 రాష్ట్రీయ డాక్టర్ అంబేద్కర్ సేవాశ్రీ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. డిసెంబరు 8న ఆయనకు అవార్డు అందిస్తున్నట్లు అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు సుమనాక్షన్ తెలిపారు.





నూతనంగా ఎన్నికైన అఖిల కర్ణాటక రాష్ట్ర కిసాన్ జాగృతి సంఘం సభ్యులు

పదాధికారుల నియామకం

కంప్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అఖిల కర్ణాటక రాష్ట్ర కిసాన్ జాగృతి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్, ఉపాధ్యక్షుడు హనుమంతప్ప నేతృత్వంలో కంప్లి అతిధిగృహంలో పదాధికారుల నియామకం మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా గంగాధర, ప్రధానకార్యదర్శి విశ్వ, జిల్లా యువఘటక అధ్యక్షులు అర్షత్, తాలుకా అధ్యక్షుడు గుబాజి రామాంజిని, ఉపాధ్యక్షుడు గాదెలింగప్ప, యువఘటక అధ్యక్షుడు శివు, ఉపాధ్యక్షుడు బాబన్న, గౌరవాధ్యక్షుడు హనుమంతప్ప, సభ్యులుగా లక్ష్మీరెడ్డి, శివు, శరణప్ప, గ్రామఘటక అధ్యక్షులు అమర్‌నాథ్ గౌడ, ఉపాధ్యక్షులుగా దేవర అంజినప్ప, రామసాగరం ఘటక అధ్యక్షులు మంజునాథ్, తదితర సభ్యులు నియామకమయ్యారు. జిల్లా అధ్యక్షులు గంగాధర రైతు సమస్యల పరిష్కారానికి ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బసవరాజు, దేవరాజు, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది



రక్తదానం చేస్తున్న యువకులు

కంప్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి కాపాడడం మహా గొప్ప కార్యమని పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. పట్టణంలో సోమవారం పంచాయతీ సభ్యులు, గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద బ్లడ్ బ్యాంకు నేతృత్వంలో సుమారు 150 మంది పౌరులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ఎంతో మంది రక్తం అందక మృత్యువాత పడుతుంటారని, అలాంటి వారిని ఆదుకునేందుకు రక్తదాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ ఉపాధ్యక్షులు కనికేరి పంపాపతి, వెంకటరమణబాబు, రాజశేఖర్‌తో పాటు పలువురు యువకులు రక్త దానం చేశారు. వీరితో పాటు దొడ్డ బసప్ప, విజయలక్ష్మీ, దొడ్డప్ప, వినోద్‌కుమార్, బసవరాజు, రాజప్ప, దాదాఖలీల్, ప్రశాంత్, గంగాధర, జాకీర్, మంజు, భీమేష్, మాంతేష్ పాల్గొన్నారు.

హోసూరు జోన్



సంబరాల్లో ఈశాన్య రాష్ట్రాల ప్రజలు

ఉత్సాహంగా కల్చరల్ ఫెస్టివల్

హోసూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): హోసూరులోని టైటాన్ స్కూల్ హాల్‌లో కృష్ణగిరి జిల్లా బధిరుల సంఘం నార్త్, ఈస్ట్ ఇండియన్ కల్చరల్ ఫెస్టివల్ ఉత్సాహంగా సాగింది. అస్సోం, త్రిపుర, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లకు చెందిన 500 మందికి పైగా బధిరులు, మూగవారు సమావేశంలో పాల్గొన్నారు. ఈశాన్య భారత రాష్ట్రాల్లోని వినికిడి సమస్య, మూగవారికి అభివృద్ధికి టాటా గ్రూప్ తోడ్పాటును అందిస్తుందని టైటాన్ సీఈఓ భాస్కర్ భట్ అభిప్రాయపడ్డారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన దివ్యాంగులు తమ తమ రాష్ట్రాల సాంస్కృతిక కళా కార్యక్రమాలను ప్రదర్శించి సభికులను అలరించారు. దివ్యాంగులకు భాస్కర్‌భట్ బహుమతులతోపాటు ఆర్థికసాయం అందచేశారు. టైటాన్ సీఈఓ భాస్కర్‌భట్ మీడియాతో మాట్లాడుతూ కృష్ణగిరి జిల్లా బధిరుల సంఘం సామాజిక సేవగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. ఈశాన్య భారత రాష్ట్రాలకు చెందిన చెవిటి, మూగవారికి ఈ ప్రాంత ప్రజలు ఎలా అభివృద్ధి చెందుతున్నారో తెలియజేయడానికి ఉద్దేశించబడినదన్నారు. ఇప్పటికే టాటా గ్రూప్ ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. టాటా గ్రూప్ అస్సోంలో 17 క్యాన్సర్ ఆసుపత్రులను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అదేవిధంగా టాటా సన్స్ ద్వారా అక్కడ సెమీ కండక్టర్ ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారని ఇది ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడనుందన్నారు. నిర్వాహకులు సురేశ్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ కృష్ణగిరి జిల్లా బధిరుల సంఘం తరపున ఈశాన్యరాష్ట్రాలకు చెందినవారు తమ ప్రతిభను చాటారన్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సంక్షేమ సంఘాల మాదిరిగానే పలు విశేషాదికారులు, మొదటి విడతగా ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ సరయు

గ్రీవెన్స్‌లో 593 వినతులు

హోసూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కెఎం సరయు నేతృత్వంలో పీపుల్స్ గ్రీవెన్స్ రిడ్రెసల్ డే సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో ప్రజలనుంచి 593 వినతులు వచ్చాయి. ఇళ్ల పట్టాలు, ఉచిత కుట్టు మిషన్‌లు, వృద్ధాప్య పించన్, మహిళా హక్కుల పథకాలు, తదితర డిమాండ్లపై అర్జీలు వచ్చాయని అర్హులైన వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్టు కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి సాధనకురళ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన పెరగాలి

హోసూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): హోసూరు దిన్నూరు ప్రైవేట్ పాఠశాల సహకారంతో పోలీసుశాఖ అధికారులు రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ కార్తికేయన్ ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు పాల్గొని రోడ్డుపై వెళ్లే వాహనదారులకు గులాబీలు ఇచ్చి అవగాహన కల్పించారు. దిన్నూరు రోడ్డు నుంచి ప్రారంభమైన అవగాహన ర్యాలీ మత్తిగిరి కూటు రోడ్డు వరకు సాగింది. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నినాదాలు చేశారు. బ్యానర్లను పట్టుకుని ర్యాలీలో సాగారు. హెల్మెట్లు ధరించాలని, కారులో సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనజాక్షి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కో-ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు,



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శంభో శంకర..!



రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఎర్రితాత

బళ్లారిరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో రామలింగేశ్వరస్వామికి ఏక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పదాధికారులు నటరాజు, వీరేష్, నాగేష్‌కుమార్, అర్చకులు నాగరాజు స్వామి తదితరులు పాల్గొన్నారు. చేళగుర్కి ఎర్రితాత ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలుపెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. పలు ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

సంపంగిరామనగరలో కార్తీక దీపోత్సవం

బెంగళూరు : కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని నగరంలోని సంపంగిరామనగర పుష్కరిణిలో దీపోత్సవం నిర్వహించారు. స్థానికులు, చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి దీపాలు వెలిగించారు. ఇక్కడ ఆదియోగి పరమశివుడి రూపం భక్తులను ఆకట్టుకుంది. నెలవంక ధారియైన శివుడికి విశేషపూజలు నిర్వహించారు.



దీపోత్సవంలో భక్తులు